మనం
కరీంనగర్
జగిత్యాల- రాజన్న సిరిసిల్ల- పెద్దపల్లి -మంచిర్యాల- కొమురంభీమ్
బుధవారం | 14 | జూన్ | 2023 | పేజీలు : 7

# రహదారుల పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలి

## కలెక్టర్ అనురాగ్ జయంతి



సిరిసిల్ల టౌన్, జూన్ 13 (మనం న్యూస్): రహదారులు, భవనాల శాఖ ఆధ్వర్యంలో జిల్లాలో ప్రగతిలో ఉన్న పెండింగ్ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో రహదారులు, భవనాల శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించి, పెండింగ్ లో ఉన్న పనుల పురోగతిపై సుదీర్ఘంగా చర్చించారు. సిరిసిల్లలో రగుడు నుండి ఎల్లమ్మ జంక్షన్ వరకు నాలుగు వరుసల రహదారుల వెంట, డివైడర్ మధ్య ప్లాంటేషన్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. రగుడు -వెంకటాపూర్ బైపాస్ కు సంబంధించి మిషన్ భగీరథ పైప్ లైన్ షిఫ్టింగ్ పనులను వచ్చే శనివారం లోగా పూర్తి చేయాలని మిషన్ భగీరథ గ్రిడ్ అధికారులకు సూచించారు. సిరిసిల్ల మున్సిపాలిటీ పరిధిలోని శాంతినగర్, రగుడు ,వెంకటాపూర్ లలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణం ఇప్పటికే పూర్తయినందున ఏమైనా పెండింగ్ మౌలిక సదుపాయాల కల్పన పనులు మిగిలి ఉంటే వెంటనే పూర్తి చేయాలి అన్నారు. అలాగే ఈనెల 19 వ తేదీలోగా మన ఊరు మనబడి కార్యక్రమం కింద చేపట్టి పూర్తిచేసిన పనులకు రంగులు వేసే పనులను పూర్తి చేయాలన్నారు.ఇప్పటికే మంజూరైన బీటీ రెన్యూవల్ పనులను వచ్చే నెలాఖరులోగా పూర్తి చేయాలన్నారు. అలాగే అన్ని పెండింగ్ పనులను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేసేందుకు పగడ్బందీ కార్యచరణను రూపొందించుకొని పనులను వేగవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో డిఎఫ్ఓ బాలామని, ఇంఛార్జి డీఆర్ఓ టి.శ్రీనివాస రావు, వేములవాడ ఆర్డీఓ పవన్ కుమార్, ఆర్ బి ఈఈ శ్యామ్ సుందర్, మున్సిపల్ కమీషనర్ లు సమ్మయ్య, అన్వేష్, సెస్ ఎండీ రామకృష్ణ, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# మహిళా సాధికారత దిశగా ప్రభుత్వం పటిష్ట చర్యలు

కడుపులో బిడ్డనుంచి పండు ముసలి వరకు సంక్షేమ పథకాలు

91స్వశక్తి సంఘాలకు 7కోట్ల 75లక్షల చెక్కు పంపిణీ

తెలంగాణ మహిళా సంక్షేమ దినత్సోవ వేడుకల్లో ఎమ్మెల్యే, అదనపు కలెక్టర్



# మహిళల ఉజ్వల భవిష్యత్‌కు బిఆర్ఎస్ ప్రభుత్వం పెద్దపీట





## బోయినపల్లి వినోద్‌కుమార్

హుజురాబాద్ రూరల్, జూన్ 13 (మనం న్యూస్): మహిళల ఉజ్వల భవిష్యత్తుకు సిఎం కెసిఆర్ నేతృత్వంలోని బిఆర్ఎస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు బోయినపల్లి వినోద్ కుమార్ అన్నారు. మంగళవారం హుజురాబాద్ పట్టణంలోని సాయి రూప గార్డెన్‌లో తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మహిళా సంక్షేమ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా 16 మంది గర్భిణీలకు సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శ్రీమంతం నిర్వహించారు. అనంతరం వినోద్‌కుమార్ మాట్లాడుతూ బాలికలు గతంలో కంటే అన్ని రంగాల్లో ముందుకు వెళ్తున్నారని, విద్యారంగంలో బాలుర కంటే మెరుగైన స్థితిలో ఉన్నారన్నారు. బాలికలు విద్యారంగంలో అభివృద్ధి చెందడం కోసం ప్రభుత్వం బాలికల గురుకులాలను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిందన్నారు. గతంలో 200 వసతి గృహాలు ఉంటే టిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వెయ్యికి పెరిగాయన్నారు. విద్యారంగాభివృద్ధి కోసం అనేక నిధులను ప్రభుత్వం కేటాయిస్తుందని, ఈ నేపథ్యంలోనే మన ఊరు మనబడి కార్యక్రమం నిర్వహిస్తోందని తెలిపారు. గతంలో వైద్య విద్యను చదవాలంటే కొంతమందికే వీలలేదని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న కాలంలో ఉమ్మడి రాష్ట్రంలో మూడు మెడికల్ కాలేజీలు ఉండేవని సీఎం కేసీఆర్ కృషి వల్ల ప్రస్తుతం 33 మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేసి తెలంగాణ విద్యార్థులకు వైద్య విద్యను దగ్గర చేశారని అన్నారు. తెలంగాణ వస్తే ఏం వస్తుందన్న వారికి నేటి తెలంగాణలో జరుగుతున్న ప్రగతే సమాధానమని వినోద్‌కుమార్ తెలిపారు. మహిళలు ఆర్థికంగా వెనుకబడి ఉండరాదని వివిధ సమస్యల మూలంగా తల్లి గారి ఇంటి పై ఆధారపడుతున్న మహిళలకు ఆదుకునే ఉద్దేశంతో దేశంలో ఎక్కడా లేనివిధంగా ఒంటరి మహిళల పింఛను అమలు చేసిన గొప్ప మనసున్న మనిషి సీఎం కేసీఆర్ అని కొనియాడారు. ఎమ్మెల్సీ పాడి కౌశిక్ రెడ్డి హుజురాబాద్ అభివృద్ధి కోసం 100 కోట్ల రూపాయల నిధులు మంజూరు చేయాలంటే ప్రభుత్వం ఆలోచించి సీఎం కేసీఆర్ ఐటీ మంత్రి కేటీఆర్ లు 238 కోట్ల నిధులు మంజూరు చేశారని అన్నారు. ఈ సందర్భంగా స్వయం సమృద్ధి మహిళా సంఘాలకు కోటి 19 లక్షల రూపాయల రుణాల చెక్కును అడిషనల్ కలెక్టర్ గరీమ అగర్వాల్ జెడ్పి చైర్ పర్సన్ కనుమల విజయలతో కలిసి అధికారులకు అందించారు. అనంతరం అడిషనల్ కలెక్టర్ గరీమా అగర్వాల్ మాట్లాడుతూ... హుజురాబాద్ నియోజకవ ర్గం లో మహిళా చైతన్యం ఎక్కువగా కనబడుతుందని 18 మంది ప్రజా ప్రతినిధుల్లో 15 మంది మహిళలే ఉండడం గొప్ప విషయమని అన్నారు మహిళలు తలుచుకుంటే ఏదైనా సాధ్యమవుతుందని ఈ విషయం ద్వారా ప్రపంచానికి అవగతమవుతుందన్నారు. అభివృద్ధి కోసం ప్రభుత్వం త్వరలో 238 కోట్ల రూపాయలు మంజూరు చేయనుందని ఆమె తెలిపారు. అనంతరం ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్ మాట్లాడుతూ మహిళల సంక్షేమం కోసం సీఎం కేసీఆర్ నిరంతరం ఆలోచించి పనిచేస్తారన్నారు. ఈ సమావేశంలో జడ్పీ చైర్ పర్సన్ కనుమల్ల విజయ, హుజురాబాద్ ఆర్డిఓ బి.హరి సింగ్, మున్సిపల్ చైర్ పర్సన్ గందె రాధిక, ఎంపీపీ ఇరుమల్ల రాణి, వైస్ చైర్ పర్సన్ కొలిపాక నిర్మల, కమిషనర్ సమ్మయ్య హుజురాబాద్ సిడిపిఓ భాగ్యలక్ష్మి, సింగిల్ విండో చైర్మన్ ఎడవెల్లి కొండల్ రెడ్డి, జెడ్పిటిసి సభ్యులు బక్కారెడ్డి , శ్రీరామ్ శ్యామ్, హుజురాబాద్ మునిసిపల్ కౌన్సిలర్లు , ఎంఇవోలు, వివిధ శాఖల అధికారులు, ఐసిడిఎస్ అధికారులు, సూపర్వైజర్లు, అంగన్వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

# మహిళా సంక్షేమానికి పెద్దపీట

## ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు

కోరుట్ల, జూన్ 13 (మనం న్యూస్): మహిళా సంక్షేమానికి సీఎం కేసీఆర్ నేతృత్వంలోని తెలంగాణ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు గారు తెలిపారు. తెలంగాణ ఉత్సవాల్లో భాగంగా కోరుట్ల పట్టణంలోని కటకంసంగయ్య ఫంక్షన్ హాల్ లో మహిళా సంక్షేమ దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆడబిడ్డలను పైకి తీసుకురావాలన్న తపనతో సీఎం కేసీఆర్ అనేక పథకాలను అమలు చేస్తూ దేశానికి స్ఫూర్తిగా నిలుస్తున్నారన్నారు. మహిళా సంక్షేమానికి ఏ రాష్ట్రం చేయనన్ని పనులు తెలంగాణాలో జరుగుతున్నాయని వివరించారు. కళ్యాణ లక్ష్మితో ఇంటి పెద్దలా, కేసీఆర్ న్యూట్రిషన్ కిట్ తో ఇంటి డాక్టర్ లా, కేసీఆర్ కిట్ తో మేనమామలా, అమ్మఒడి తో సంరక్షకుడిలా, ఆరోగ్య లక్ష్మి తో ఆరోగ్య దాతగా, షీ టీంలతో రక్షకుడిగా ముఖ్యమంత్రి కేసీఆర్ అండగా నిలిచారని పేర్కొన్నారు. బీడీ కార్మికులకు పెన్షన్ తో భరోసానిస్తూ ఒంటరి మహిళలకు చేదోడుగా ఉంటున్నారని తెలిపారు. స్థానిక సంస్థల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించి వారిని రాజకీయ వ్యవస్థలు భాగస్వామ్యం చేసిన ఘనత కేసీఆర్ కు దక్కుతుందని అన్నారు. బిందెలతో నీటికోసం కిలోమీటర్ల దూరం నడవకుండా, ఇంటికే సురక్షిత నీరు అందించాలన్న ఉద్దేశంతో మిషన్ భగీరథ కార్యక్రమాన్ని తీసుకొచ్చారని గుర్తు చేశారు. అంగన్ వాడి, ఆశా కార్యకర్తలకు జీతాలు పెంచిన ఆపద్బాంధవుడని



చెప్పారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ మంద మకరందు గారు, ఆర్డిఓ వినోద్ కుమార్ గారు, రైతు సంఘం అధ్యక్షులు చీటి వెంకట్రావు గారు, మునిసిపల్ చైర్మన్ అన్నం లావణ్య అనిల్ గారు, ఎంపిపిలు సాయిరెడ్డి, సరోజన ఆదిరెడ్డి, బీమేశ్వరి జగన్ గార్లు, జెడ్పిటిసిలు లావణ్య రాజేష్, శ్రీనివాస్ రెడ్డి గార్లు, అధికారులు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీ



ఇల్లంతకుంట, జూన్ 13 (మనం న్యూస్): తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఇల్లంతకుంట ఎస్సై రాజేష్ ఆధ్వర్యంలో మంగళవారం ఆర్యవైశ్య భవన్‌లో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని వివిధ గ్రామాల నుండి వచ్చిన మహిళలకు ముగ్గుల పోటీల్లో పాల్గొన్నారు. సీనియర్, జూనియర్ విభాగంలో నిర్వహించిన ఈ పోటీలకు కెజిబివి ప్రిన్సిపాల్ శిరీష, మహిళా ఉపాధ్యాయులు మాధవి, ఆరోగ్యశాఖ తారాబాయిలు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. ఈ పోటీల్లో సీనియర్ విభాగంలో కె.మంగకు మొదటి బహుమతి, కె.మమతకు రెండవ బహుమతి, ఎ.జయశ్రీకి మూడవ బహుమతి లభించగా, జూనియర్ విభాగంలో వి.స్నేహితకు మొదటి బహుమతి, కె.సంజనకు రెండవ బహుమతి, బి.భవితకు మూడవ బహుమతి లభించింది. అదేవిధంగా ఈ ముగ్గుల పోటీలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి ప్రోత్సాహక బహుమతులు అందించారు.

## 17వ పోలీసు బెటాలియన్ శ్రమదానం



సిరిసిల్ల, జూన్ 13 (మనం న్యూస్): తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా 17వ పోలీస్ బెటాలియన్ సిబ్బంది, అధికారులు బెటాలియన్ ఇంఛార్జ్ కమాండెంట్ యమ్.జయరాజు ఆధ్వర్యంలో సర్దాపూర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం శ్రమదానం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కమాండెంట్ జయరాజు మాట్లాడుతూ వర్షాకాలం సమీపిస్తుండడంతో ప్రాణాంతక వ్యాధులు ప్రబలకుండా తమ వంతు కృషిగా శ్రమదానం నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా అధికారులు, సిబ్బంది కలిసి చెత్తాచెదారం, పొదలు, పిచ్చి మొక్కలను తొలగించామని తెలిపారు. దీనివల్ల పాఠశాల విద్యార్థులకు వాతావరణం పరిశుభ్రంగా ఉంటుందని తెలిపారు. ఇలాంటి కార్యక్రమాల్లో పాలుపంచుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ యమ్. పార్థసారథి రెడ్డి, సర్దాపూర్ 9వ వార్డ్ కౌన్సిలర్ లింగంపల్లి సత్యనారాయణ, ఆర్ఐలు పి.నారాయణ, డి.శంకర్, పి.శ్రీనివాస్, రాజేందర్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## టిఎన్జీవో నాయకులకు ఘన సన్మానం



కరీంనగర్, జూన్ 13 (మనం న్యూస్): నూతనంగా ఎన్నికైన టిఎన్జీవోల సంఘం జిల్లా అధ్యక్షులు దారం శ్రీనివాస్‌రెడ్డి, కార్యదర్శి సంగం లక్ష్మణ్‌రావులను నాయి బ్రాహ్మణ సేవా సంఘం జిల్లా, నగర శాఖల ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో టిఎన్జీఓ సంఘం పట్టణాధ్యక్షులు హర్మిందర్ సింగ్, నాయిబ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు నీలం మొండయ్య, నగర అధ్యక్షులు జంపాల సంపత్, ప్రధాన కార్యదర్శి కంది వెంకటేష్, నగర ఉపాధ్యక్షులు నిమ్మకంటి రమేష్, సమ్మెట శ్రీనివాస్, జంపాల బిక్షపతి, నగర కార్యదర్శి కొండూరు శ్రీనివాస్, కొత్తగట్టు రమేష్, జనగామ లక్ష్మణ్, నీలిగొండ రాము తదితరులు పాల్గొన్నారు.

## జమ్మికుంట మార్కెట్ కమిటీ చైర్ పర్సన్‌కు

### దళిత మహిళ రిజర్వేషన్ అయినందుకే వివక్ష చూపిస్తున్నారు

### పట్టణ మహిళా కాంగ్రెస్ అధ్యక్షులు పుష్పలత



హుజురాబాద్ రూరల్, జూన్ 13 (మనం న్యూస్): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ పదవి ఎస్సీ మహిళకు రిజర్వు కావడం మూలంగానే బిఆర్ఎస్ ప్రభుత్వం వివక్ష చూపిస్తోందని హుజురాబాద్ పట్టణ మహిళా కాంగ్రెస్ అధ్యక్షులు యేముల పుష్పలత ఆరోపించారు. మంగళవారం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ దళిత మహిళకు రిజర్వేషన్ కల్పించి ఏడాది గడుస్తున్నా ఇంతవరకు కమిటీని నియమించడంలో ప్రభుత్వం పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యవర్గ నియామకంలో జరుగుతున్న జాప్యానికి రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు బోయినపల్లి వినోద్‌కుమార్, ఎమ్మెల్సీ కౌశిక్ రెడ్డిలు ప్రజలకు సమాధానం చెప్పాలని ఆమె డిమాండ్ చేశారు. తక్షణమే పూర్తి స్థాయి మార్కెట్ కమిటీ కార్యవర్గాన్ని ప్రకటించాలన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి సొల్లు బాబు, హుజురాబాద్ నియోజకవర్గ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు మొలుగూరి సదానందం, జిల్లా ఉపాధ్యక్షురాలు సుశీల, మైనార్టీ సెల్ పట్టణాధ్యక్షుడు అప్సర్, సీనియర్ నాయకులు ఎర్ర రవీందర్, కుర్ర శీను, రమేష్ ,బిక్షపతి ,సంపత్, రఘుపతి, ఐలయ్య, మధు , రవి, సునీత ,లక్ష్మి, ఓదెలు తదితరులు పాల్గొన్నారు.



## దళిత కుటుంబాల ఆర్థిక, సామాజిక, ఉపాధి అవకాశాలపై సర్వే

మెట్ పల్లి, జూన్ 13 (మనం న్యూస్): ఆర్థిక సామాజిక అధ్యయన సంస్థ ద్వారా మంగళవారం పట్టణంలోని మూడవ వార్డు ఇందిరా నగర్ కాలనీలో మాల సంఘం భవనం వద్ద దళిత కుటుంబాల ఆర్థిక, సామాజిక,ఉపాధి అవకాశాలపై అసోసియేషన్ ప్రొఫెసర్ డాక్టర్ సురేష్ రెడ్డి, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ నరేష్‌లు సర్వే నిర్వహించారు. ఇందులో భాగంగా మాల సంఘ నాయకులు గోరమంతల మారుతి, బూరం రవిలతోపాటు పలు దళిత సంఘ సభ్యులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్‌లు మాట్లాడుతూ ఈ సర్వే ద్వారా దళితులకు ఉపాధి అవకాశాలు, ప్రభుత్వ కార్యక్రమాలు, పథకాలు అందుతున్న తీరును తెలుసుకోవడంతో పాటు వ్యవసాయ కుటుంబాలు, వారి స్థితిగతుల గురించి అధ్యయనం చేస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా పంటలు పండక పోవడంతో వారి కుటుంబ పోషణ, అలాగే పండిన పంటలు త్వరగా అమ్ముడు పోకపోవడంతో వారే వ్యవసాయ పెట్టుబడి ఎలా చేస్తున్నారు అన్నది సర్వే నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రతి కుటుంబ ంలో ఎంతమందికి పెన్షన్లు వస్తున్నాయి కుటుంబ పోషణ ఎలా జరుగుతుంది అన్నా అంశాలపై సర్వే నిర్వహిస్తున్నామన్నారు.

## విద్యాసంస్థలకు వారం రోజులు సెలవులు ప్రకటించాలి

### బిసి విద్యార్థి సంఘం రాష్ట్ర కో-ఆర్డినేటర్ రాజుగౌడ్

సిరిసిల్ల, జూన్ 13 (మనం న్యూస్): రాష్ట్రవ్యాప్తంగా ఎండలు తీవ్రంగా ఉన్న నేపథ్యంలో విద్యాసంస్థలకు మరో వారం రోజుల పాటు వేసవి కాల సెలవులను పెంచాలని బిసి విద్యార్థి సంఘం రాష్ట్ర కో- ఆర్డినేటర్ కంచర్ల రాజు గౌడ్ డిమాండ్ చేశారు. మంగళవారం సిరిసిల్లలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎండల తీవ్రత వల్ల విద్యార్థులు చాలా ఇబ్బంది పడుతున్న కారణంగా వారం రోజులు సెలవులను పొడిగించాలన్నారు. ఈ సమావేశంలో సంఘం డివిజన్ ఇంచార్జ్ ఇల్లందుల ప్రకాష్, మండల అధ్యక్షుడు మట్ట నరేష్, పట్టణ అధ్యక్షుడు రుద్రవేణి సుజిత్, నాయకులు వంశీ, అల్లే నీరజ్ తదితరులు పాల్గొన్నారు.



# తెలంగాణ రాష్ట్రంలో మహిళ సంక్షేమానికి పెద్ద పీట

## రామగుండం శాసనసభ్యులు కోరుకంటి చందర్



గోదావరిఖని,జూన్ 13 (మనం న్యూస్): తెలంగాణ రాష్ట్రంలో మహిళ సంక్షేమానికి పెద్ద పీట వేస్తున్న మనసున్న ముఖ్యమంత్రి కేసీఆర్ అని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు.తెలంగాణ ఆవరతణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం గోదావరిఖని దుర్గానగర్ లోని ఆర్కె గార్డెన్లో నిర్వహించిన తెలంగాణ మహిళా దినోత్సవానికి రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ముఖ్య అతిధిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన ఇంటిలో మహిళలు ఆరోగ్యంగా, ఆనందంగా ఉంటేనే ఆ కుటుంబం సుఖ సంతోషాలతో ఉండగలుగుతుందన్నారు. గర్భిణీ స్త్రీలు,పాలిచ్చే తల్లులలో పోషకాహార లోపాన్ని నివారించడం కోసం అంగన్వాడీ కేంద్రాల ద్వారా సమతుల పౌష్టికాహారాన్ని అందించడానికి ఆరోగ్య లక్ష్మి పథకం ప్రవేశపెట్టిందన్నారు. గర్భిణీ స్త్రీలను ప్రసవం కోసం ప్రభుత్వ హాస్పిటల్ కి తరలించడం, ప్రసవానంతరం తల్లీ బిడ్డలను తిరిగి క్షేమంగా ఇంటికి చేర్చడం కోసం అమ్మ ఒడి పేరుతో అంబులెన్స్ వసతి సౌకర్యం కల్పించారని అన్నారు. గర్భిణీ స్త్రీల ప్రసవం కోసం, నవజాత శిశువుల సంరక్షణ కోసం ప్రత్యేక సదుపాయాలతో పట్టణాలలో,జిల్లా కేంద్రాలలో మాతా శిశు హాస్పిటల్స్ ను ప్రభుత్వమే నిర్వహిస్తోందన్నారు. బాలికల కోసమే రెసిడెన్షియల్ పాఠశాలలు, కళాశాలలు, గురుకుల పాఠశాలలు నిర్వహిస్తూ వారికి ఉచితంగా కేజీ టు పీజీ విద్య అందిస్తుందన్నారు. పెళ్లీడుకొచ్చిన పేదింటి ఆడబిడ్డల పెళ్లికి తల్లిదండ్రుల కు భారంగా భావించకుండా ఉండెందుకు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాన్ని ప్రవేశపెట్టి విజయవంతంగా అమలు చేస్తుందన్నారు.ఔత్సాహిక మహిళా పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించడం కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన పథకం వి హబ్ అని తెలిపారు.తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రత్యేకించి మహిళల కోసమే సుమారు 40 సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి, పకడ్బందీగా అమలు చేస్తున్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో రామగుండం నగర మేయర్ డాక్టర్ బంగీ అనిల్ కుమార్,జడ్పీటీసీ అముల నారాయణ, మున్సిపల్ కమీషనర్ సుమన్ రావు, కార్పొరేటర్లు ధరని స్వరూప జలపతి,జనగామ కవిత సరోజీనీ,బాల రాజ్ కుమార్,జంగపల్లి సరోజీని,సర్పంచ్ తుంగపిండి సతీష్, రామగుండం సిడిపిఓ పుష్పలత అధికారులు రజనీ తదితరులు పాల్గొన్నారు.

## భీంగల్‌లో అరుదైన శస్త్ర చికిత్స



భీంగల్, జూన్ 13 (మనం న్యూస్)ః నిజామాబాద్ జిల్లా భీంగల్ పట్టణానికి చెందిన శ్రీ శివసాయి హాస్పిటల్‌లో మహిళకు శస్త్ర చికిత్స చేసిన వైద్యులు ఆరు కిలోల కంతిని తొలగించారు. భీంగల్ పట్టణానికి చెందిన జమున (30) అనే మహిళ గత నాలుగేళ్లుగా కడుపు నొప్పితో బాధపడుతూ పలు హాస్పిటల్‌లో సంప్రదించినా ఎలాంటి ప్రయోజనం లేకపోవడంతో శ్రీ శివసాయి హాస్పిటల్‌ను ఆశ్రయించింది. సోమవారం హాస్పిటల్ ఎండి సాయికుమార్ యాదవ్ ఆధ్వర్యంలో వైద్యులు ఎల్.ప్రదీప్తి గైనకాలజిస్ట్, సూర్యనారాయణ ఎమ్మెస్ జనరల్ సర్జన్‌లు సదరు మహిళకు శస్త్ర చికిత్స నిర్వహించి సుమారు ఆరు కిలోల కంతిని తొలగించారు. ఈ ఆపరేషన్ లో హాస్పిటల్ సిబ్బంది షాబుద్దీన్, హరిత, నందిని, వార్డ్ బాయ్ గణేష్ తదితరులు పాల్గొన్నారు.



## అలుగునూర్ మున్నూరు కాపు నూతన కార్యవర్గం

తిమ్మాపూర్, జూన్13 (మనం న్యూస్): కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం అలుగునూర్(8వ డివిజన్)లో మంగళవారం మున్నూరు కాపు సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. అధ్యక్షులుగా చిందం మల్లేశం, గౌరవ అధ్యక్షులుగా పురంశెట్టి అనోహర్, ఉపాధ్యక్షులు సల్ల జితేందర్, ప్రదాన కార్యదర్శిగా చిందం మహేష్, సహాయ కార్యదర్శిగా సి.హెచ్ మల్లేష్, కోశాధికారిగా సి.హెచ్ మల్లేశం,ముఖ్య సలహాదారులుగా సల్ల కిష్టయ్య, చిందం కనక య్య, కార్యవర్గ సభ్యులుగా చిందం సంపత్, చిందం రాజయ్య, ఈరుపాటి రాజయ్య, సల్ల కనకయ్య,చిందం చంద్రయ్య లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

## వైభవంగా సంక్షేమ పథకాల సంబరాలు



మానకొండూరు, జూన్ 13 (మనం న్యూస్)ః రాష్ట్ర సాంస్కృతిక సారథి చైర్మన్, మానకొండూర్ శాసనసభ్యులు డాక్టర్ రసమయి బాల కిషన్ సారథ్యంలో మంగళవారం మానకొండూరులోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన ప్రభుత్వ సంక్షేమ పథకాల సంబురాలు అంగరంగ వైభవంగా కొనసాగాయి. ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు బి.వినోద్ కుమార్, బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, సుడా చైర్మన్ రామకృష్ణా రావు లు హాజరయ్యారు. దశాబ్ది వేడుకల్లో భాగంగా మహిళా సంక్షేమ దినోత్సవాన్ని ఆనందోత్సాలతో జరుపుకుంటు, ప్రభుత్వ మహిళా ఉద్యోగులతో పాటు మహిళా ప్రజాప్రతి నిధులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ముఖ్య మంత్రి కె. చంద్రశేఖర్ రావు ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలపై సాంస్కృతిక సారథి కళాకారులు ఆలపిం చిన గీతాలు ప్రజలను విశేషంగా అలరించగా, ఆడబి డ్డలు బతుకమ్మ ఆడుతూ ఆనందంగా గడిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీ చైర్మన్ విజయ, రాజన్న సిరిసిల్ల జిల్లా జడ్పీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు, ఎంపీపీ లు, జడ్పీటీసీలు, సర్పంచులు, మహిళా మూర్తులు, ప్రజాప్రతినిధులు, బీ.ఆర్.ఎస్. పార్టీ శ్రేణులు,అన్ని అనుబంధ సంఘాల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## విద్యాసంస్థల వాహన డ్రైవర్లకు అవగాహన సదస్సు



మెట్ పల్లి, జూన్ 13 ( మనం న్యూస్)ః పట్టణంలోని కీర్తి ఫంక్షన్ హాల్ లో మంగళవారం విద్యా సంస్థల డ్రైవర్లకు అవహగహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన డిఎస్పీ రవీందర్ రెడ్డి మాట్లాడుతూ విద్యాసంస్థల ప్రతి వాహనానికి తప్పనిసరిగా రవాణా శాఖ జారి చేసిన ఫిట్నెస్ సర్టిఫికెట్ తప్పనిసరి కలిగి ఉండాలన్నారు. స్కూల్స్ బస్ లకి సంబంధించి అన్ని వాహన పత్రాలు కల్గివుండాలన్నారు. బస్సు సరైన కండిషన్‌లో ఉందో లేదో ముందే జాగ్రత్తపడాలని సూచించారు. వర్షాకాలంలో డ్రైవర్ అప్రమత్తంగా లేకపోతే రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని స్కూల్ బస్సుల్లోచిన్న పిల్లలే ప్రయాణిస్తారని చాలా జాగ్రత్త వహించాలిని తెలిపారు. స్కూల్ వాహనాలకు ఎలాంటి చిన్న ప్రమాదం జరిగిన సంబంధిత డ్రైవరు, యాజమాన్యం పై కఠినంగా వ్యవహరిస్తామన్నారు. పిల్లలని స్కూల్ కి తీసుకొని వచ్చేటప్పుడు ఇంటికి తీసుకొని వెళ్లే క్రమంలో బస్సు హెల్పర్ వెనుక ముందు చూసుకొన్నాకనే వారిని బస్సు నుండి దింపాలి పిల్లలు రోడ్డు దాటవలసివస్తే హెల్పర్ తప్పక దాటించాలని సూచించారు. ట్రాఫిక్ నియమనిబంధనలు పాటించక పోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డివిజన్ లో నిబంధనలు పాటించని స్కూల్ బస్సులపై పోలీస్, ఆర్టీఏ అధికారులు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తూ సీజ్ చేస్తామన్నారు. డాక్టర్ అంజిత్ సి పి ఆర్ పై అవగాహన కల్పించి ప్రథమ చికిత్స ను ఎలా అందిచాలనే అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో మెట్ పల్లి సిఐ లక్ష్మీనారాయణ, ఎస్సైలు శ్యామ్ రాజ్, మన్మధరావు, ఉమాసాగర్, నవీన్, మోటార్ వెహికల్ ఇన్స్‌పెక్టర్ రంజిత్, పోలీస్ సిబ్బంది, మెడికల్ ఆఫీసర్ అంజిత్, స్కూల్ బస్ డ్రైవర్లు పాల్గొన్నారు.

## న్యూ విజన్ పాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ



జమ్మికుంట, జూన్ 13 (మనం న్యూస్)ః జమ్మికుంట న్యూ విజన్ పాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం మజ్జిగ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అసో సియేషన్ అధ్యక్షుడు అశోక్ మాట్లాడుతూ ప్రజలకు ఎండ తీవ్రత నుండి ఉపశమనం కలిగించాలనే ఉద్ధేశ్యంతో మజ్జిగ పంపిణీ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ప్రతి సంవత్సరము ఎండాకాలం ఇలాంటి సామాజిక కార్యక్రమాలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమరంలో అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ జయరాజ్, ట్రెజరర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## నర్సరీనీ పరిశీలించిన మున్సిపల్ కమిషనర్



మెట్ పల్లి జూన్ 13(మనం న్యూస్): పట్టణంలోని 13వ వార్డు రేగుంట లో గల నర్సరీని మంగళవారం మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల19న రోజున హరితోత్సవం మొక్కలు నాటే కార్యక్రమం ఉన్నందున నర్సరీ ప్రక్కన ఖాళీ స్థలంలో మొక్కలు నాటేందుకు ఫిటింగ్ చేయించి మొక్కలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. నర్సరీలో పనిచేసే సిబ్బంది పర్మిషన్ లేకుండా విధులకు గైర్హాజర్ ఐనా మరియు పనిలో నిర్లక్ష్యం చేసినా తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.రాబోయే వర్షాకాలంలో మొక్కలు నాటేందుకు ఏర్పాట్లు చేయాలని తెలిపారు . ఈ కార్యక్రమంలో ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ విష్ణు, జూనియర్ అసిస్టెంట్ విజయ్, ముజీబ్, అనిల్, జనార్ధన్, హరితహారం సిబ్బంది పాల్గొన్నారు.

## బ్రహ్మయ్య కుటుంబాన్ని పరామర్శించిన బిఆర్ఎస్ నాయకులు



చిగురుమామిడి, జూన్ 13 (మనం న్యూస్)ః ఇటీవల గుండె పోటుతో మరణించిన చిగురుమామిడి మండలం ఓగులాపూర్ గ్రామ బిఆర్ఎస్ ప్రచార కార్యదర్శి ఇల్లందుల బ్రహ్మయ్య కుటుంబాన్ని బిఆర్ఎస్ నాయకులు మంగళవారం పరామర్శించారు. ఈ సందర్భంగా మృతుని చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కొత్త శ్రీనివాస్ రెడ్డి, మండల అధ్యక్షుడు మామిడి అంజయ్య, సర్పంచ్ బోయిని శ్రీనివాస్, బిఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు ఏంద్ర నారాయణ, యూత్ అధ్యక్షులు కవంపల్లి తిరుపతి, వార్డ్ మెంబర్ తాటిపల్లి అంజయ్య, నాయకులు ఉల్లి శ్రీనివాస్, అందే బోయిన శంకర్, బద్దం మల్లారెడ్డి, లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రైల్వే ఓవర్ బ్రిడ్జి సొమ్ము కేంద్రానిదైతే.. సొమ్ము బిఆర్ఎస్‌దా..?


## బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్

కరీంనగర్, జూన్ 13 (మనం న్యూస్): కరీంనగర్ పట్టణం తీగలగుట్టపల్లిలో రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం కేంద్ర ప్రభుత్వ నిధులతో జరుగుతుంటే , బిఆర్ఎస్ ఈ విషయంలో ఏదో ఘనకార్యం చేసినట్టు పాలాభిషేకాలు చేయడం , ఆర్ఓబి పై ప్రచారాలు చేసుకోవడం విడ్డూరంగా ఉందని బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్ విమర్శించారు. మంగళవారం కరీంనగర్‌లో ఆయన మాట్లాడుతూ కరీంనగర్ పట్టణం తీగలగుట్టపల్లి ఎల్ సి నం.18 వద్ద రోడ్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులను కేంద్ర ప్రభుత్వం 126.74 కోట్ల నిధులతో చేపట్టడానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందన్నారు. అయితే ఆర్ఓబి నిర్మాణానికి సంబంధించి టెండర్లు ఖరారైన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయంలో ఘనత గా చెప్పుకుంటూ సంబరాలు చేసుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఇన్నేళ్లుగా టెండర్లు ఖరారు చేయకుండా ,పనులకు మోక్షం కలిగించే పరిస్థితుల్లో బిఆర్ఎస్ లేదన్నారు. 9ఏళ్లుగా రాష్ట్రంలో అధికారంలో కొనసాగుతున్న కేసీఆర్ ప్రభుత్వం ఆర్ఓబి నిర్మాణం చేయాలనే ఆలోచన, ప్రయత్నాలు ఏనాడు చేయలేదని, కరీంనగర్ పార్లమెంటు సభ్యులుబిజెపి రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్ కుమార్ ఆర్ఓబి సమస్య పరిష్కారం కోసం ప్రత్యేక దృష్టి సారించి, అందుకోసం తగిన ప్రయత్నాలు చేశారని తెలిపారు. ముఖ్యంగాతీగలగుట్టపల్లి ప్రాంతంలో రోడ్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని ఎంపీ బండి సంజయ్ కుమార్ పలుమార్లు కేంద్ర రైల్వే శాఖ మంత్రికి, సంబంధిత అధికారులకు చేసిన విజ్ఞప్తులకు స్పందించిన కేంద్ర ప్రభుత్వం లోగడ నే తీగలగుట్టపల్లి ప్రాంతంలో 100 కోట్ల రూపాయల నిధులతో రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ వాటా భాగస్వామ్యంతో చేపట్టడానికి కావలసిన అన్ని అనుమతులనుమంజూరు చేసిందన్నారు. ఆర్ఓబి నిర్మాణం కోసం కేంద్ర ప్రభుత్వం తన వాటా నిధులను గత ఏడాది మంజూరు చేసినా, రాష్ట్ర ప్రభుత్వం తన వాటా నిధులను రిలీజ్ చేయలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్య కారణంగా ఆర్ఓబి ఆర్ఓబి అంచనా వ్యయం నేడు126.74 కోట్లకు పెరిగిందన్నారు. తీగలగుట్టపల్లి ప్రాంతంలో రోడ్ ఓవర్ బ్రిడ్జి లేకపోవడంతో అనునిత్యం ఇక్కడి ప్రాంతం మీదుగా ప్రయాణం చేసే వాహనదారులు, ప్రజలు, ముఖ్యంగా ఆసుపత్రులకు వచ్చే రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నా, ప్రభుత్వం ఇన్నేళ్లుగా చోద్యం చూస్తుందన్నారు. ఇక్కడి ప్రాంతంలో జటిలంగా మారిన ఆర్ఓబిసమస్యను అధికారంలో ఉన్న కెసిఆర్ ప్రభుత్వం గాలికి వదిలేస్తే, కరీంనగర్ పార్లమెంటు సభ్యుడు బండి సంజయ్ కుమార్ పట్టుదల కృషితో రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణ సమస్యను పరిష్కరించడానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారని తెలిపారు.ఆర్ఓబి ప్రాజెక్టు నిర్మాణ విషయంలో బిఆర్ఎస్ ప్రభుత్వం తగిన నిధులు మంజూరు చేయడానికి ముందుకు రాక, ఏడాదికాలంగా జాప్యం చేయడంతో ఎంపీ బండి సంజయ్ కుమార్ ఇట్టి ప్రాజెక్టును పూర్తిస్థాయి కేంద్ర ప్రభుత్వ నిధులతోనే నిర్మాణం చేపించడానికి ,. నూతన ప్రతిపాదనలతోకేంద్ర ప్రభుత్వ సేతు బంధన్ నిధులతో తీగలగుట్టపల్లి ఆర్ఓబిని రూపాయలు 126.74 కోట్లతో నిర్మాణం చేపట్టడానికి కేంద్ర ప్రభుత్వం ద్వారా గ్రీన్ సిగ్నల్ ఇప్పించారని పేర్కొన్నారు. ఎంపీ బండి సంజయ్ కుమార్ పై రాజకీయ విమర్శలు చేయడమే పనిగా పెట్టుకున్న బిఆర్ఎస్ ప్రభుత్వానికి, ఆ పార్టీ నాయకులకు 126.74 కోట్లతో కేంద్ర ప్రభుత్వమే రోడ్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేసే విధంగా బండి సంజయ్ కుమార్ ప్రయత్నం చేసి అందులో సక్సెస్ కావడం ఆయన పనితీరుకు నిదర్శనంగా నిలుస్తుందన్నారు . అయితే ఆర్ఓబి నిర్మాణ పనులను పూర్తి చేయడానికి కేంద్ర ప్రభుత్వమే ముందుకు వచ్చిన రాష్ట్ర ప్రభుత్వం ఏడు నెలల కాలంగా ఏలాంటి సమీక్ష , టెండర్ల



ప్రక్రియ నిర్వహించకుండా పనులపై అలసత్వం ప్రదర్శించిందన్నారు . ఆర్ఓబి అంశంలో పూర్తిగా కెసిఆర్ ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిని ప్రదర్శించి , నేడు ఆర్ఓబి సమస్య కొలిక్కి వచ్చి టెండర్లకు ఆహ్వానించిన నేపథ్యంలో బిఆర్ఎస్ శ్రేణులు సంబరాలు జరుపుకోవడానికి సిగ్గుండాలన్నారు. బి ఆర్ ఎస్ నేతలకు విజ్ఞత ఉంటే ఆర్ఓబి పనులపై తప్పుడు ప్రకటనలు చేయడం మానుకోవాలని, కేంద్ర ప్రభుత్వ నిధులతో పనులు జరుగుతున్నందుకు బిజెపి మోడీ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేయాలని ఆయన ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.

## అంతర్ రాష్ట్ర సైబర్ మోసగాని అరెస్టు



సిరిసిల్ల టౌన్, జూన్ 13 (మనం న్యూస్): జల్సాలకు అలవాటు పడి సైబర్ నేరాలకు పాల్పడుతున్న యువకున్ని రాజన్న సిరిసిల్ల పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ అఖిల్ మహాజన్ నిందితుని



వివరాలు వెల్లడించారు. ఆయన కథనం ప్రకారం బీహార్‌కు చెందిన కుందన్ కుమార్ (25) అనే యువకుడు అమాయక ప్రజలను లక్ష్యంగా చేసుకుని పలు సైబర్ నేరాలకు పాల్పడుతున్నాడు. తొమ్మిదవ తరగతి మాత్రమే చదివిన నిందితుడు ఇంటి వద్దనే ఉంటూ కంప్యూటర్ కోర్సు నేర్చుకుని ఆన్ లైన్ మోసాలు చేయడమే పనిగా పెట్టుకున్నాడు. జల్సాలకు అలవాటు పడ్డ సదరు యువకుడు సులభంగా డబ్బు సంపాదించాలన్న ఆశతో పలువురుని ఆన్‌లైన్ ద్వారా మోసగించి డబ్బులు దోచుకున్నాడు. బాధితుల నుంచి అందిన ఫిర్యాదు మేరకు విచారణ నిర్వహించి, కుందన్ కుమార్‌ను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్పీ తెలిపారు. నిందితుని వద్ద నుంచి రెండు లక్షల రూపాయల నగదుతో పాటు మూడు మొబైల్ ఫోన్లు, ఆరు సిమ్ కార్డులు, బ్యాంకు పాస్‌బుక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ వివరించారు.

### ధాన్యం విక్రయించి రెండు మాసాలైన

# రైతుల ఖాతాల్లోకి చేరని డబ్బులు

### ఇదేనా రైతు సంక్షేమం..?

### కాంగ్రెస్ నాయకులు సారంగపాణి

ఇల్లందకుంట, జూన్ 13 (మనం న్యూస్): ఆరుగాలం కష్టించి పండించిన వరిధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి రెండు మాసాలు కావస్తున్నా ఇప్పటి వరకు అన్నదాతల ఖాతాల్లో ప్రభుత్వం డబ్బులు వేయలేదని సీనియర్ కాంగ్రెస్ నాయకులు గూడపు సారంగపాణి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పంటలు విక్రయించినప్పటికీ ఇంతవరకు డబ్బులు చేతికి రాక రైతులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారన్నారు. అప్పులు చేసి వేసిన పంటలను అమ్ముకున్నా డబ్బులు రాకపోవడంతో వడ్డీలు తడిసి మోపెడవుతున్నాయని అన్నదాతలు లబోదిబోమంటున్నా బిఆర్ఎస్ ప్రభుత్వానికి పట్టడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతు సంక్షేమ ప్రభుత్వమని ప్రకటినలిచ్చుకునే బిఆర్ఎస్ నాయకులు చేస్తోన్న రైతు సంక్షేమం ఇదేనా అని సారంగపాణి ప్రశ్నించారు. అకాల వర్షాలతో పంటలు నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకునే చర్యలు కూడా కానరావడం లేదన్నారు. నష్టపోయిన రైతుకు ఎకరాకు పదివేల రూపాయల పరిహారం ఇస్తామని ప్రకటించిన కెసిఆర్ ఇప్పటి వరకు ఇచ్చిన పాపాన పోలేదన్నారు. తక్షణమే రైతులు విక్రయించిన ధాన్యానికి డబ్బులు చెల్లించాలని, నష్టపోయిన రైతులందరికీ పరిహారం వెంటనే విడుదల చేయాలని



ఆయన డిమాండ్ చేశారు. లేని పక్షంలో రైతులను కలుపుకుని కాంగ్రెస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమం నిర్వహించనున్నట్లు హెచ్చరించారు. ఈ సమావేశంలో జమ్మికుంట పట్టణ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పూదరి శివకుమార్ గౌడ్, తాడం దిలీప్ కుమార్, తిరుపతి వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.




## కార్పొరేట్ విద్యాసంస్థలకు ధీటుగా సాంఘిక సంక్షేమ విద్యాసంస్థలు

### మున్సిపల్ చైర్మన్ రాజేశ్వరరావు

జమ్మికుంట, జూన్ 13 (మనం న్యూస్): కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా సాంఘిక సంక్షేమ విద్యాసంస్థలు నడుస్తున్నాయని జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ తక్కెళ్ళపల్లి రాజేశ్వరరావు అన్నారు. మంగళవారం స్థానిక తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కౌన్సిలర్‌లు సారంగం, శ్రీపతి నరేష్, సింగిల్ విండో చైర్మన్ పొనగంటి సంపత్‌లతో ముఖ్య అతిథిగా హాజరైన రాజేశ్వర్‌రావు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.అనంతరం విద్యార్థులు మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కుమారస్వామి, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# స్వరాష్ట్రంలో మహిళలకు సముచిత స్థానం

## జడ్పీ చైర్ పర్సన్ న్యాలకొండ అరుణ

సిరిసిల్ల టౌన్, జూన్ 13 (మనం న్యూస్)ః తెలంగాణ ఆవిర్భవించిన నాటి నుంచి సిఎం కెసిఆర్ మహిళలకు సముచిత స్థానాన్ని అందిస్తూ అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నారని రాజన్న సిరిసిల్ల జడ్పీ చైర్ పర్సన్ న్యాలకొండ అరుణ రాఘవరెడ్డి అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా మంగళవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో పద్మనాయక ఫంక్షన్ హాల్ లో మహిళా సంక్షేమ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టెస్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్ రావు, టెక్స్‌టైల్స్ కార్పొరేషన్ చైర్మన్ గూడూరి ప్రవీణ్, కలెక్టర్ అనురాగ్ జయంతి, అడిషనల్ కలెక్టర్ సత్య ప్రసాద్, జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ అకునూరి శంకరయ్య, రైతు బంధు అధ్యక్షులు గడ్డం నర్సయ్య, మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళ చక్రపాణి, జడ్పీటీసీ లు, ఎంపీపీ లతో కలిసి ఆమె ముఖ్య అథితిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళల సంక్షేమం పట్ల చేస్తున్న పలు అభివృద్ధి పథకాలు





దేశంలోనే ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మహిళల సంక్షేమం కోసం అనేక పథకాలు చేపడుతూ కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్,కెసిఆర్ కిట్, న్యూట్రిషన్ కిట్, ఆరోగ్య లక్ష్మి,ఆసరా పింఛన్, వితంతు పింఛన్ ఒంటరి మహిళ పింఛన్ వంటి పథకాలు తీసుకొచ్చి మహిళల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేసిందన్నారు. మహిళల కోసం ప్రత్యేకంగా రాష్ట్రవ్యాప్తంగా షీ టీమ్స్, సఖి సెంటర్ లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో బాలింతలకు మంచి పౌష్టికాహారం ఇవ్వడం జరుగుతుందన్నారు. మహిళలకు స్థానిక సంస్థలు కమిటీలలో 50 శాతం రిజర్వేషన్ కల్పించి వారికి రాజకీయ నాయకత్వ అవకాశాలను కల్పిస్తున్న ఘనత బిఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కిందని అరుణ అన్నారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉద్యోగినులకు ప్రశంసా పత్రాలు అందించారు. తదనంతరం సంక్షేమ శాఖ వారు ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీలు, జడ్పీటిసి లు, సీఈఓ గౌతం రెడ్డి, డిడబ్ల్యుఓ లక్ష్మి రాజం, డిఇవో రమేష్ కుమార్, డిటివో నీరజ, ఎస్సీ కార్పొరేషన్ ఇడి వినోద్ కుమార్, కౌన్సిలర్లు, అధికారులు, మహిళలు పాల్గొన్నారు.



## చెత్త వేసిన దుకాణాదారునికి రూ.పదివేల జరిమానా విధించిన కమిషనర్



సిరిసిల్ల టౌన్, జూన్ 13 (మనం న్యూస్)ః సిరిసిల్ల మున్సిపాలిటీ పరిధిలో రోడ్డుపై చెత్త వేసిన దుకాణాదారునికి కమిషనర్ సమ్మయ్య పది వేల రూపాయల జరిమానా విధించారు. పారిశుధ్య పర్యవేక్షణలో భాగంగా ఆయన మానేరు బ్రిడ్జి పరిసర ప్రాంతాల్లో సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆ ప్రాంతంలో ఆరుబయట నిర్లక్ష్యంగా చెత్తపడేసి ఉండడాన్ని గమనించిన ఆయన స్థానికులను ఆరాతీశారు. ఈ సందర్భంగా గాంధీ చౌక్‌లోని కావ్య బెంగుళూరు బేకరి నిర్వాహకుల పనే అని తేలడంతో వారిని పిలిపించి పది వేల రూపాయల జరిమానా విధించి, వసూలు చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ గతంలో కూడా పట్టణ శివారు ప్రాంతాల్లో గాని ఓపెన్ ప్లేసులో గాని చెత్త పడేసే వారిని గుర్తించి జరిమానాలు వేయడం జరిగిందన్నారు. అయినప్పటికీ కొంతమందికి పరిపక్వత రావట్లేదని, ఈ నేపథ్యంలోనే భారీ జరిమానాలు విధిస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో ఎవరైనా ఇదేవిధంగా చేత్త పడవేసిన కేవలం పాదాచారులకు మాత్రమే కేటాయించిన ట్విన్ బిన్స్ లో గృహ అవసరాలకు సంబంధించిన చెత్తను పడవేసిన ఇదే రకంగా జరిమాణాలు విధించడం జరుగుతుందని ఎవరిని కూడా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సానిటరీ ఇన్స్పెక్టర్ బి.సత్యనారాయణ, సానిటరీ జవాన్ ఉమర్, హెల్త్ అసిస్టెంట్ సుకుమార్, జవాన్లు, పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీధర్మశాస్త్ర గోశాల పౌండేషన్ శాశ్వత స్థలం కొరకు వినతి



సుల్తానాబాద్,జూన్ 13(మనం న్యూస్): సుల్తానాబాద్ మున్సిపాలిటి పరిధి యాదవ్‌నగర్ కాలనీలో తాత్కాలిక షెడ్‌లో నిర్వహిస్తున్న శ్రీధర్మశాస్త్ర గోశాల పౌండేషన్‌కు శాశ్వత స్థలం కొరకు పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి, సుల్తానాబాద్ మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం వినతి పత్రం సమర్పించారు. ఈకార్యక్రమంలో ధర్మశాల గోశాల ఫౌండేషన్ అధ్యక్షుడు బండారి సూర్య, ప్రధాన కార్యదర్శి నూక రామదాసు, శ్రీనివాస్, మున్సిపల్ చైర్మన్ ముత్యం, సునిత రమేష్‌గౌడ్, వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ బుర్ర మౌనిక, శ్రీనివాస్‌గౌడ్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## పార్లమెంట్ సాక్షిగా మహిళలకు ద్రోహం

### మహిళా ఉద్యమకారులను మరిచిన కేసీఆర్

### మహిళా దినోత్సవ సందర్భంగా మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ



పెద్దపల్లి, జూన్ 13(మనం ప్రతినిధి): సాధించిన తెలంగాణలో మహిళా ప్రగతి శూన్యమని ఉద్యమ కాలంలో పార్లమెంట్ సాక్షిగా మహిళలకు ఇచ్చిన హామీలను విస్మరించిన సీఎం కేసీఆర్ ను అధికార పీఠం నుంచి దించాలని పెద్దపల్లి కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ కౌన్సిలర్ ఫోరం ధ్వజమెత్తింది. తెలంగాణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా మహిళా దీవాస్ సందర్భంగా తెలంగాణ ఇచ్చిన సోనియా గాంధీకి మంగళవారం పెద్దపల్లి మండలం పెద్దబొంకూరు గ్రామంలో ఉపాధి హామి కూలీల మధ్య కాంగ్రెస్‌పార్టీ కౌన్సిలర్లు పాలాభిషేకం చేశారు. ఉపాధి హామిలకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. నాటి ఉద్యమ నిర్మాణంలో డిల్లీ పార్లమెంట్ ముట్టడికి వెళ్లిన మహిళా ఉద్యమకారులతో తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు కాగానే మహిళల అభివృద్ధికి పెద్దపీట వేస్తానని అనేక హామీలు ఇచ్చిన సీఎం కేసీఆర్ మహిళల ఆర్థిక అభివృద్ధికి ఏవిధంగా తోడ్పాడు అందించడం లేదని విమర్శించారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో జరుగుతున్న మహిళా దివాస్ సందర్భంగా ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన సోనియాగాంధీ, సహకరించిన నాటి పార్లమెంట్ స్పీకర్ మీనా కుమారి, నాటి బీజేపీ ప్రతిపక్ష నేత సుష్మాస్వరాజ్‌ను సీఎం కేసీఆర్ స్మరించకపోవడం మహిళా లోకాన్నే అవమాన పరిచినట్లు పెద్దపల్లి కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ ఫోరం ఆరోపించారు. తెలంగాణ రాష్ట్రంలో మద్యానికి యువత బానిసలుగా మారి లక్షలాది కుటుంబాలు ఆర్థికంగా అణగారి పోతున్నారని ధ్వజమెత్తారు. మద్యం బానిసతో మహిళలు కుటుంబ యజమానిని కోల్పోతున్నారని, తెలంగాణలో ఈపరిస్థితి దాపురించిందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మద్యాన్ని ఆదాయ వనరులుగా చూడవద్దని వారు అన్నారు. ఈకార్యక్రమంలో పెద్దపల్లి కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్‌నూగిళ్ల మల్లయ్య, భూతగడ్డ సంపత్, తూముల నంబారావు, తాడూరి పుష్పకళాశ్రీమాన్, నేత్తెట్ల స్వరూప, సీనియర్ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సాయిబాబా ఆశీస్సులతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలి

### సాయిబాబా వార్షికోత్సవానికి హాజరైన ఎమ్మెల్యే దాసరి



సుల్తానాబాద్,జూన్ 13 మనం న్యూస్ ః సాయిబాబా ఆశీస్సులతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ప్రజలందరిపై బాబా దీవెనలు ఎప్పుడు ఉండాలని పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి అన్నారు. సుల్తానాబాద్ పట్టణంలోని సాయిబాబా ఆలయ 14వ వార్షికోత్సవానికి హాజరైన ఎమ్మెల్యే కి ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక ఆహ్వానం పలికారు. అనంతరం బాబా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు సారధ్యంలో అభివృద్ధి పథంలో పయనిస్తోందని ఇతర రాష్ట్రాలు అబ్బుర పడేలా రాష్ట్రాన్ని అభివృద్ధి పరుస్తూ ముందుకు తీసుకు వెళుతున్నారని రానున్న రోజుల్లో దేశంలోనే నెంబర్ వన్ స్థాయికి తెలంగాణ రాష్ట్రాన్ని తీసుకువచ్చే ప్రయత్నంలో ముఖ్యమంత్రి పాలన కొనసాగిస్తున్నారన్నారు బాబా ఆశీస్సులతో తిరిగి మూడోసారి బిఆర్ఎస్ ప్రభుత్వం అధికారం చేపట్టే విధంగా సంకల్పాన్ని అందించాలన్నారు.నియోజకవర్గంలోని ప్రజలందరిపై బాబా దీవెనలు ఉండి ప్రజలందరూ ఆయురారోగ్యాలు అష్టైశ్వర్యాలు పాడిపంటలతో విరాజిల్లాలని కొనియాడారు. మూడోసారి బిఆర్ఎస్ అధికారం సాధించేలా సంకల్ప బలాన్ని బాబా ఆశీస్సులతో ప్రజలు అందించాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే ని కమిటీ సభ్యులు శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ముత్యం సునీత రమేష్,ఎఎంసి చైర్మెన్ బుర్ర మౌనిక శ్రీనివాస్,ఆలయ వ్యవస్థాపక అధ్యక్షులు మాటేటి గట్టయ్య, బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు పురం ప్రేమ్ చందర్‌రావు,పట్టణ అధ్యక్షులు పారుపల్లి గుణపతి,తిరుపతిరెడ్డి ,సర్వేర్,సర్వేష్,తుమ్మ రాజ్‌కుమార్,మియాపురం శ్రీనివాస్,ఎడవెల్లి రాంరెడ్డి,మాడూరి ప్రసాద్, ములుగూరి అంజయ్య, కౌన్సిలర్ తిరుపతి,పట్టణ యూత్ అధ్యక్షుడు వహీద్, రాజోజుల శివలతో పాటు ఆలయ కమిటీ సభ్యులు పలువురు పాల్గొన్నారు.

# కష్టార్జితం కోసం ఆందోళన చేసిన రైతులకు బేడీలు వేస్తారా..?

## ఏం ఒరగబెట్టారని దశాబ్ధి ఉత్సవాలు జరుపుతున్నారు..?

### హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే ప్రవీణ్ రెడ్డి

చిగురుమామిడి, జూన్ 13 (మనం న్యూస్)ః ఆరుగాలం కష్టించి పండించిన పంటలను కొనుగోలు చేసిన ప్రభుత్వం సకాలంలో తమ కష్టార్జితాన్ని అందించాలని ఆందోళన నిర్వహించిన అన్నదాతల చేతులకు బిఆర్ఎస్ బేడీలు వేయిస్తోందని హుస్నాబాద్ మాజీ శాసన సభ్యులు అల్గిరెడ్డి ప్రవీణ్ కుమార్ అన్నారు. తొమ్మిదేళ్ల పాలనలో రాష్ట్ర ప్రజలకు, ఈ ప్రాంత అభివృద్ధికి ఏం ఒరగబెట్టారని దశాబ్ధి ఉత్సవాల పేరిట సంబరాలు చేసుకుంటున్నారని బిఆర్ఎస్ నాయకులను ప్రశ్నించారు. పల్లె పల్లెకు ప్రవీణన్న... గడప గడపకు కాంగ్రెస్ కాంగ్రెస్.. కార్యక్రమంలో భాగంగా ఆయన చిగురుమామిడి మండలం రామంచ గ్రామంలో మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా ప్రవీణ్ రెడ్డి కి కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. తొలుత కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరించిన ఆయన, ఇంటింటా తిరుగుతూ కాంగ్రెస్ పార్టీ అధికారం లోకి వచ్చిన తరవాత నెరవేర్చ బోయే హామీలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ దశాబ్ది ఉత్సవాల వేడుకలు ఎవరి కోసం జరుపుతున్నారని ప్రశ్నించారు. రైతులు, ప్రజలు సంతోషంగా ఉన్నపుడు పండగ అని, అలాంటి రైతులను నిరసన వ్యక్తం చేస్తే బేడీలు వేసి, అరెస్టులు చేస్తున్నారన్నారు. అకాల వర్షాలతో పంట నష్ట పోయిన రైతులకు ఎకరాకు 10 వేల రూపాయల పరిహారం ఇస్తామన్న హామీని సీఎం నెరవేర్చలేక పోయారని విమర్శించారు. ధాన్యం కొనుగోలు విషయంలో తేమ పేరుతో తరుగు తీసి రైతన్న పొట్టకొడుతున్నారన్నారు. ధాన్యం విక్రయించిన రైతులకు నెల రోజులు అయినా బిల్లులు రాక తీవ్ర ఇక్కట్లు పడుతున్నారని, ఇవేవి పాలకులకు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పెట్రోల్,



డీజిల్, వంట గ్యాస్ ధరలను పెంచి పేద ప్రజల నడ్డి విరుస్తుందన్నారు. మాయ మాటలు చెప్పి, మోస పూరిత వాగ్దానాలు చేసి తెలంగాణలో అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ ఈ ప్రాంత ప్రజానీకాన్ని మోసం చేసిందని ఆయన ఆరోపించారు.

ఇంటికో ఉద్యోగం ఇస్తామని చెప్పి కనీసం ఊరికో ఉద్యోగం కూడా ఇవ్వలేక పోయిన కెసిఆర్ ప్రభుత్వానికే దక్కుతుందని ప్రవీణ్‌రెడ్డి ఎద్దేవా చేశారు. పేదలకు డబుల్ బెడ్ రూం ఇస్తామని చెప్పి ఊరికి ఒక ఇల్లు కూడా కట్టివ్వ లేదని, తాను ఎమ్మెల్యేగా ఉన్నపుడు కాంగ్రెస్ పార్టీ హయాంలో అర్హులైన పేద లందరికీ ఎలాంటి పైరవీలు లేకుండా ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేశామని గుర్తు చేశారు. అలాగే అర్హులైన పేదలందరికీ కాంగ్రెస్ పార్టీ సంక్షేమ పథకాలు అందించిందన్నారు. ప్రస్తుతం తెలంగాణ లో అధికారం లో ఉన్న బీఆర్ఎస్ పార్టీ కనీసం అర్హులైన వారికి రేషన్ కార్డులు, పించన్లు అందించడంలో కూడా విఫలమైందన్నారు. రాష్ట్రంలో కేవలం మూడు నియోజకవర్గాల్లో మాత్రమే అభివృద్ధి జరిగిందని, మిగతా నియోజకవర్గాల్లో అభివృద్ధి శూన్యమని. ఒక్క కేసీఆర్ కుటుంబం ఎమ్మెల్యేలుగా ఉన్న నియోజకవర్గంలో అభివృద్ధి జరిగితే తెలంగాణ రాష్ట్రం మొత్తం సస్యశ్యామలంగా ఉందని ఎలా భావిస్తారని ప్రశ్నించారు. ప్రభుత్వం లేకలేక ఉద్యోగాలకు నోటిఫికేషన్లు వేయగా, పేపర్ లీకేజీ లతో యువత రోడ్డున పడిందన్నారు. నీళ్లు, నిధులు, నియామకాలు అని చెప్పి మాయ మాటలు చెప్పి తెలంగాణ ప్రజలను మభ్య పెట్టీ కేసీఆర్ ప్రభుత్వం అధికారం లోకి వచ్చిందని అన్నారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని అధికారం లోకి తీసుకువచ్చి తెలంగాణ ప్రజల ఆకాంక్షను నేరవేర్చిన సోనియా గాంధీ రుణం తీర్చుకోవాలని ప్రవీణ్ రెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి చిట్టి మల్ల రవీందర్, అధికార ప్రతినిధి ఐరెడ్డి సత్యనారాయణ రెడ్డి, మండల. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కంది తిరుపతి రెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షులు వంట కాల సంపత్ రెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ కూతురు రవీందర్ రెడ్డి, మాజీ పిసిసి సభ్యులు చిట్టంపల్లి అయిలయ్యా, మైనార్టీ సెల్ అధ్యక్షులు శాబొద్దిన్, బిసి సెల్ అధ్యక్షులు పొన్నం సంపత్, మహిళా నాయకురాలు ఓరుగంటి భారతి దేవి, పొలు స్వప్న, టాకూర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఇందుర్తి బుర్కి రాజయ్య,,నరేందర్ సింగ్, అందె మేకల పరశు రాములు, కూతురు మల్లా రెడ్డి, సారా బుడ్డ రాజి రెడ్డి, దొంత సుధాకర్, గాదె పాక సునీల్, కోనేటి రాములు, గుజ్జుల తిరుమల్ రెడ్డి, ఎల్లయ్య, సోషల్ మీడియా బొయిని వేణు, కాంతాల మహిపాల్ రెడీ, రెడ్డి యాద గిరి, మిట్ట పెల్లి ఆదర్శ్, వడియాల్ సంతోష్ రెడ్డి, వరి కోలు సంతోష్, దోమ శ్రీనివాస్ రెడ్డి, మేకల పరశు రాములు , కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## బీజేపీలోకి పలువురు నాయకులు చేరికలు



పెద్దపల్లి, జూన్ 13 (మనం ప్రతినిధి): కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు చెందిన మైనార్టీ నాయకులు మంగళవారం బీజేపీ మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామక్రిష్ణారెడ్డి సమక్షంలో బీజేపీలో చేరారు. వారి పార్టీ కండువాకప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈసందర్బంగా వసీంరాజా, ముజాహిద్ రాజా మాట్లాడుతూ భారతదేశ కీర్తి పతాకాన్ని ప్రపంచవ్యాప్తంగా చేస్తున్న భారత దేశ ప్రధాని మోదీ పనితీరుకు ఆకర్షితులై పార్టీలో చేరినట్లు తెలిపారు. సబ్‌కా సాత్ సబ్‌కా వికాస్ నినాదంతో నిస్వార్థంగా పనిచేస్తున్న బీజేపీపై కొంతమంది అసత్యప్రచారాలు చేస్తున్నారని అన్నారు. పెద్దపల్లిలో మైనార్టీలను పెద్ద ఎత్తున బీజేపీలోకి తీసుకురానున్నట్లు వారు తెలిపారు.

## పాఠశాలపై దౌర్జన్యం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

### పోలీసులకు ఫిర్యాదు చేసిన కమిటి



పెద్దపల్లి, జూన్ 13 (మనం ప్రతినిధి): పాఠశాలను దౌర్జన్యంగా ఆక్రమించుకోవాలని చూస్తున్న వారి నుండి తమకు రక్షణ కల్పించాలని ఇండియా మిషన్ పాఠశాల అడ్ హక్ కమిటి సభ్యులు కోరారు. పాఠశాల కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకరులసమావేశంలో వారు మాట్లాడుతూ పాఠశాలతో ఎలాంటి సంబంధంలేని వ్యక్తులు అక్రమంగా చొరబడి పాఠశాల కరస్పాండెంట్ ధనుంజయ రెడ్డిపై దాడి చేసి, పాఠశాల కరస్పాండెంటుగా ప్రకటించుకున్నారని తెలిపారు. రాజకీయ అండతోనే దౌర్జన్యానికి పాల్పడ్డారని ఆవేదన చెందారు. 23యేళ్లుగా పాఠశాల అభివృద్ధి కోసం పాటుపడిన ధనుంజయరెడ్డిపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. దాడికి పాల్పడ్డ అంకరి కుమార్, మనోహర్, సుదర్శన్‌లపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. మరోమారు తమ జోలికి వస్తే ప్రతిఘటణ తప్పదని హెచ్చరించారు. ఈసమావేశంలో అడ్ హక్ కమిటి అధ్యక్షుడు మోసే, కార్యదర్శి కుమార్, కోశాధికారి రవి, సభ్యులు జాన్, బర్నబ, మోజేస్, సామ్యేల్ పాల్గొన్నారు.

## దశాబ్ది ఉత్సవాల పేరుతో చెరువు మట్టి తవ్వకాలు



### చెరువుల సంబరాల పేరుతో సర్పంచులకు అన్యాయం

### మున్సిపల్ కార్యాలయాలను ముట్టడిస్తాం

### మద్దతు ధర పెంచిన కేంద్ర ప్రభుత్వం

### ఇంటింటికి మహాజన్ అభియాన్

పెద్దపల్లి, జూన్ 13 (మనం ప్రతినిధి): తెలంగాణ దశాబ్ది ఉత్సవాల పేరుతో చెరువుల మట్టి తవ్వకాలు చేస్తూ కోట్ల రూపాయలు అర్జించడమే ధ్యేయంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పని చేస్తున్నారని బీజేపీ మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామక్రిష్ణారెడ్డి మండిపడ్డారు. బీజేపీ మాజీ ఎమ్మెల్యే కాశిపేట లింగయ్యతో కలిసి మంగళవారం ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాలలో ఉన్న చెరువుల మట్టి తవ్వకోవడానికి ఎమ్మెల్యేలకు అధికారాలు ఇవ్వడం సిగ్గుచేటని ఆరోపించారు. దశాబ్ది ఉత్సవాలలో చెరువులపై సంబరాలు సరిపడా నిధులు ఇవ్వకుండా గ్రామ సర్పంచులపై భారం మోపడం ఏమిటని ప్రశ్నించారు. ఇప్పటికే చేసిన పనులకు బిల్లులు రాకా ఆందోళనలో ఉన్న సర్పంచుల తలపై ఆర్థిక భారం మోపడం సరైంది కాదన్నారు. బీజేపీ ఆందోళనతో రాష్ట్రంలో వరిదాన్యం కొనుగోలు ప్రారంభమయ్యాయని తెలిపారు. రైతుల సంక్షేమమే ధ్యేయంగా కేంద్ర ప్రభుత్వం పంటల మద్దతు ధరను 7శాతం పెంచిందని సంతోషం వ్యక్తం చేశారు. దాన్యం కొనుకోలు సందర్భంగా క్వింటాలుకు 10కిలోల చొప్పున తరుగుతో మోసం చేయడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. తక్షీత్ రాకపోవడంతో రైతుల అకౌంట్లల లో డబ్బులు జమ కావడంలేదని, తక్షణమే రైతుల ఖాతాలలో డబ్బులు జమచేయాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గంలో మట్టి, ఇసుక మాఫియా ఆగడాలు మితిమీరిపోయాయని అవినీతికి పాల్పడ్డవారిని వదిలిపెట్టబోమన్నారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించబోతోందని జోష్యంచెప్పారు. ఇంటింటికి మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమాన్ని తీసుకెళ్తున్నట్లు వివరించారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో శక్తివంచన లేకుండా కృషి చేశానన్నారు. అనంతరం కాశిపేట లింగయ్య మాట్లాడుతూ స్థానిక సమస్యలపై మున్సిపల్ కార్యాలయాలను ముట్టడిస్తామని తెలిపారు. ఈసమావేశంలో మాజీ జిల్లా అధ్యక్షుడు మీసాఅర్జున్‌రావు, లింగారెడ్డి, కన్నం అంజయ్య, ఠాకూర్ రాంసింగ్, కొంతం శ్రీనివాస్‌రెడ్డి, పిన్నింటి రాజు, ఆదివేశరావు, కాసర్ల జనార్ధన్‌రెడ్డి, వెల్లంపల్లి శ్రీనివాస్‌రావు, పుట్ట రవి, పల్లె సదానందం, పర్శ సమ్మయ్య, ఎండి ఫహీం, ఓదెలు, ఎరుకల శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళా సాధికారత దిశగా ప్రభుత్వం పటిష్ట చర్యలు

పెద్దపల్లి, జూన్ 13 (మనం ప్రతినిధి): మహిళా సాధికారత దిశగా ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకుంటుందని, మహిళా సంక్షేమ కోసం అనేక కార్యక్రమాలను అమలు చేస్తుందని ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి అన్నారు. పెద్దపల్లిలోని ఆర్‌ఆర్ గార్డెన్‌లో మంగళవారం రాష్ట్ర ఆవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా నిర్వహించిన తెలంగాణ మహిళా సంక్షేమ దినోత్సవ కార్యక్రమంలో పెద్దపల్లి ఎమ్మెల్యే, అదనపు కలెక్టర్ వి.లక్ష్మీనారాయణతో కలిసి పాల్గొన్నారు. తెలంగాణ మహిళ సంక్షేమ దినోత్సవానికి వచ్చిన ఎమ్మెల్యే, అదనపు కలెక్టర్‌ను మహిళలు బతుకమ్మలు, బోనాలతో ఘనంగా స్వాగతించారు. మహిళా సంక్షేమ దినోత్సవం వేడుకలను ఎమ్మెల్యే, అదనపు కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం సాధించి 9ఏళ్లు పూర్తి చేసుకున్న నేపథ్యంలో సాధించిన విజయాలు ఘనంగా చాటాలని రాష్ట్ర ఆవతరణ దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. మహిళలు అన్ని రంగాలలో ముందుండాలనే ఉద్దేశ్యంతో సీఎం కేసీఆర్ స్థానిక సంస్థల్లో మహిళలకు రిజర్వేషన్ కల్పించడం జరిగిందని, మార్కెట్ కమిటీలలో, పోలీసు ఉద్యోగాల నియామకంలో 33శాతం మహిళలకు కేటాయించారని ఎమ్మెల్యే అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులను అద్భుతంగా తయారు చేసుకున్నామని పెద్దపల్లిలో వందపడకల మాతా,శిశు ఆసుపత్రి ఆధునిక వసతులతో నిర్మించుకున్నామని తెలిపారు. అదనపు కలెక్టర్ వి.లక్ష్మీనారాయణ మాట్లాడుతూ కడుపులో ఉన్న బిడ్డదగ్గర నుంచి పండు ముసలి వాళ్ల వరకు ప్రభుత్వం ప్రతి దశలో సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని అదనపు కలెక్టర్ అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులలో ఉచితంగా ప్రసవం జరిపించి కేసీఆర్ కిట్ పథకం అమలు చేస్తున్నామని, పుట్టిన పిలలు ఎదుగుదలకు అంగన్‌వాడి కేంద్రాల ద్వారా ప్రభుత్వం తోడ్పాటు అందిస్తుందని తెలిపారు. పిల్లల చదువుకోసం ప్రభుత్వం కస్తుర్బా గాంధీ విద్యాలయాలు, రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలలు, వృత్తి నైపుణ్య విద్య చదివేందుకు స్కాలర్‌షిప్ పీజు రియింబర్స్‌మెంట్ ఇలా ఎన్నో సంక్షేమాలు అమలు చేస్తుందన్నారు. ఆడపిల్లల భద్రత కోసం ప్రత్యేకంగా షీటీం బృందాలు, ముఖ్యమైన ప్రదేశాలలో సీసీ కెమరాలు, ఆడపిల్లల పెండ్లికి ఆర్థిక సహాయం, కుల మతాలకతీతంగా కల్యాణ లక్ష్మి, షాది ముబారక్ కింద






లక్షా116సహాయం అందజేస్తుందని తెలిపారు. 91స్వశక్తి మహిళా సంఘాలకు 7కోట్ల75లక్షల50వేల విలువచేసే రుణం చెక్కులను పంపిణీ చేశారు. విధి నిర్వహణలో ఉత్తమ ప్రదర్శన కనబరిచిన మహిళా అధికారులకు, ఉద్యోగులకు ప్రశంస పత్రాలు అందించి సన్మానించారు. ఈకార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ రఘువీర్‌సింగ్, పెద్దపల్లిమున్సిపల్ చైర్మన్ మమతారెడ్డి, జిల్లా సంక్షేమాధికారి రౌఫ్‌ఖాన్, జిల్లా గ్రామీణాధికారి శ్రీధర్, జిల్లా ఉపాధికారి వై.తిరుపతిరావు, ఈఈఆర్ అండ్‌బీ బి.నరసింహాచారి, జిల్లా బీసీ అభివృద్ధి అధికారి రంగారెడ్డి, జిల్లా అధికారులు,ప్రజాప్రతినిధులు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

మనం
జనం కోసం... అక్షర యజ్ఞం...
తెలుగు దినపత్రిక

కావలెను

'మనం' తెలుగు దినపత్రికకు ఈ దిగువ పేర్కొన్న సర్కిల్స్ పరిధిలో విలేకరులుగా పనిచేసేందుకు ఉత్సాహవంతులు కావలెను. చక్కటి రాత, తెలుగుభాషపై పట్టు ఉండి ఆసక్తి గల వారి నుంచి దరఖాస్తులు కోరబడుతున్నవి.

కావలసిన ప్రాంతాలు :

**కరీంనగర్ జిల్లా :** సైదాపూర్, గంగాధర, గన్నేరువరం, హుజురాబాద్ ఆర్.సి. రామడుగు

**పెద్దపల్లి :** పెద్దపల్లి టౌన్ & రూరల్, జూలపల్లి, పాలకుర్తి, అంతర్గాం, గోదావరిఖని టౌన్, జ్యోతినగర్, రామగుండం, 8 ఇన్ క్లైయిన్ కాలని, కమాన్‌పూర్

మండలాల వారిగా రిపోర్టర్లు కావలెను. అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును.

**రాజన్న సిరిసిల్ల :** వేములవాడ (ఆర్.సి), వేములవాడ టౌన్ & రూరల్, కోనారావుపేట, రుద్రంగి, చందుర్తి, ముస్తాబాద్, ఎల్లారెడ్డిపేట.

**జగిత్యాల :** జగిత్యాల టౌన్ & క్రైమ్, మేడిపెల్లి, కోరుట్ల రూరల్, ఇబ్రహీంపట్నం, గొల్లపల్లి, సారంగాపూర్, మల్యాల, కొడిమ్యాల

- Friends Digitals, KNR - 7989030554

మనం
జనం కోసం... అక్షర యజ్ఞం...
తెలుగు దినపత్రిక

ఉమ్మడి కరీంనగర్ జిల్లా కార్యాలయం
సాయికృష్ణ థియేటర్ ఎదురుగా
భగత్‌నగర్, కరీంనగర్.

పూర్తి వివరాలకై సంప్రదించవలసిన ఫోన్ నెంబర్
సెల్ : 83339 98076